

# పశ్చాత్తాపం

—దినవహి రామానంద్





'బుకింగ్ బయట టికెట్లు కొనకండి' అన్న స్లైడు చూడగానే రామారావు గుండెల్లో రైళ్ళు పరుగెత్తినట్లనిపించింది. మెల్లగా తాతగారి వంక చూశాడు. ఆయన అవేం పట్టనట్లు కూర్చున్నాడు. హమ్మయ్య అనుకున్నాడు. సినిమా మొదలయింది. భయంకర శబ్దాలతో టైటిల్స్ జరుగుతున్నాయి. అంతకంటె భయంకరంగా ఉంది రామారావు పరిస్థితి. కథ అర్థం చేసుకునే స్థితిలో లేడు. టికెట్ గురించి ఏమవుతుందో నన్న భయం. మాటి మాటికి గేటువైపు చూస్తున్నాడు. థియేటర్ ఎయిర్ కూల్ అయినా, అతని బాడీకి సూపర్‌హిట్‌లా ఉంది. అందుకే ఎ. సి. చల్లదనం అతనిని ఏమీ చేయలేక పోతోంది. గేట్‌బాయ్ లోపలికి వస్తున్నప్పుడల్లా గుండె స్పీడు హెచ్చుతోంది. కళ్ళ ముందు పంచరంగుల చిత్రం జరిగిపోతోంది. అయినా, సినిమాలో ఏం జరుగుతోందో తెల్సుకునే స్థితిలో లేడు. చుట్టుప్రక్కల చూశాడు. అందరూ తనని బోనులో నిలబడ్డ ఖైదీని చూస్తున్నట్లు ఫీలయ్యాడు.

మనసు వికల మయింది. వెనక లైనులోంచి గేట్‌బాయ్ తన దగ్గరకు వస్తున్నట్లు గమనించాడు. కంటిముందున్న సినిమాలో లీనమవడానికి ప్రయత్నించాడు. సినిమాలో ఇన్ స్పెక్టర్ పారిపోతున్న దొంగని వెంటాడి పట్టుకోవడానికి పరుగెడుతున్నాడు. రామారావు సినిమా చూస్తూ దగ్గరికి వస్తున్న గేట్‌బాయ్‌ని పరిశీలిస్తున్నాడు. భుజాల మీద చెయ్యివేసి లాగి కొట్టాడు సినిమాలో ఇన్ స్పెక్టర్. రామారావు భుజంమీద సడన్‌గా చెయ్యి పడటంతో ఒళ్ళంతా చెమటలు పోసి నిస్త్రాణువై పోయాడు. నెమ్మదిగా కళ్ళు తెరచి చూశాడు. "ఆ సీట్లో కూర్చోండి" అంటూ వెళ్ళిపోతున్న గేట్‌బాయ్ కనిపించాడు. మరి చెయ్యెవరిది అని ప్రక్కకు చూశాడు. కేశవరావు చెయ్యి భుజం మీద ఉండటం చూసి నెమ్మదిగా ఊపిరి పీల్చుకుని ఇబ్బందిగా చెయ్యి తీశాడు రామారావు. సీట్లో కూర్చోలేక పోతున్నాడు. పోనీ, ఇంటికి పోదామా అంటే సభ్యత అడ్డువచ్చింది. గేట్‌బాయ్‌ని చూస్తున్నప్పుడల్లా రామారావు గుండెల్లో దడ, ఆయాసం పెరుగుతోంది. జరిగిన దంతా అతని కళ్ళ ముందు మెదుల్తోంది.

** ** **

సినిమావచ్చి చాలా రోజులయిందేమో ఎక్కువగా జనం లేరు. రామారావు బుకింగ్‌లో దూరి బాల్కని టికెట్స్ నాలుగు రూపాయలవి మూడిమ్మని తీసుకుని బాక్ పాకెట్‌లో కుక్కుకుని టైం చూసుకున్నాడు. అయిదూ ఇరవై అయింది.

ఇంకా నలభై నిమిషాలుంది షో స్టార్ట్ కావడానికి. ఇంత సేపు థియేటర్‌లో ఏమి చేస్తాం అనుకుంటూ, బయట హాలులో మిత్రుడు కేశవరావు ప్రక్కన సోఫాలో కూర్చున్నాడు. పది నిమిషాలు గడిచాయి. జేబులోంచి టికెట్స్ తీసేందుకు లేచి నుంచున్నాడు రామారావు. ప్రక్కనే ఉన్న వ్యక్తి ఇదే ఛాన్సనుకొని ఆ సీటులో కూర్చున్నాడు. టికెట్స్ తీసుకుని కూర్చోబోయే రామారావుకి అతన్ని చూడగానే మీదపడి నాలుగు వాయిద్దామనిపించింది. కాని, ఏం చేయలేక "లోపల సీట్లు చూద్దాం..రా!" అన్నాడు కేశవరావుతో. కేశవరావు భార్య కూడా వారితో బయలుదేరింది.

గేటు దగ్గర వ్యక్తి టికెట్స్ చింపి కౌంటర్ ఫాయిల్స్ ఇచ్చాడు. జేబులో పెట్టుకుని లోపలికి నడిచారు. ఎదురుగా ఉన్న మంచి సీట్లలో కూర్చోబోతుంటే "నెంబర్, సార్" అంటూ అడిగాడు గేట్‌బాయ్.

అప్పుడుగాని గుర్తుకు రాలేదు రామారావుకి, టికెట్ మీద నెంబర్లున్నాయని. టికెట్ నంబర్లు చూసి, టార్చి ఎక్కడో వేసి-ఇంకో చోట ఎక్కడో చూపించి-"ఆ వరసలో అయిదవ సీటు నుంచి" అన్నాడు తన జ్ఞాపకశక్తికి తనే గర్వపడుతూ గేట్‌బాయ్.

అసలే లైట్ సరిగ్గా లేదేమో కుర్చీ మోకాలుకు తగిలి పడబోయి తమాయించుకుని-"వెధవ థియేటర్... సరైన లైటింగ్ లేదు, అరేంజ్‌మెంట్స్ లేవు. ఛీ ఛీ" అంటూ విసుక్కున్నాడు. నెమ్మదిగా సీట్లు వెదుక్కుంటూ వచ్చి నెంబర్స్ వెరిఫై చేసుకుని కరెక్ట్‌గానే ఉన్నాయే అనుకున్నాడు. ఎటు నుండి లెఖ్ఖపెట్టినా ఒక సీటు మిగిలిపోతోంది. ఏదో పజిల్‌లా ఫీల్ అయ్యాడు రామారావు. ఒక నిమిషం ఆలోచించి జేబులో డబ్బు చూసుకుని టికెట్ల వంక చూశాడు.

రామారావును గమనిస్తూ, "ఏమైందిరా-కాష్ తక్కువ ఇచ్చాడా" అంటూ అడిగాడు కేశవరావు.

"కాష్ తక్కువ కాదురా..." అంటూ రహస్యంగా చెప్పాడు. ఇద్దరూ ఏదో గుస గుస లాడుకున్నారు.

గేట్‌బాయ్ దగ్గరికి వెళ్ళి- "చూడు, బాబూ! మేము నాలుగు టికెట్లు తీసుకున్నాం. ఇంకొకతను రావాలి. కాని, తొందరలో నాలుగూ ఇచ్చేశాం. నువ్వు చింపేశావ్" అన్నాడు రామారావు గేట్‌బాయ్‌తో.

"మీ కో టికెట్ ఎక్కువ వచ్చిందా?" అంటూ ప్రమోషన్ కోసం కేసు పట్టిన హెడ్ కాని స్టేబులా ఫోజు పెట్టి అడిగాడు గేట్‌బాయ్.


కంగారుపడ్డాడు రామారావు. "లేదండి-మా ఫ్రెండ్ ఇంకా రాలేదు" అంటూ స్వరం కలిపాడు కేశవరావు.

"టికెట్స్ మీద నంబర్స్ ఉన్నాయి గదా! పాస్ అక్కర్లేదు వెళ్ళండి" అన్నాడు గేట్‌బాయ్.

"అనవసరంగా ఈ విషయం వాడికి చెప్పి కంగారు పడ్డానే. ఛీ! వెధవ బుర్ర" అనుకుంటూ కేశవరావు వెనకాలే బయలుదేరాడు రామారావు.

నాలుగు రూపాయల బుకింగ్ క్లోజ్ చేశారు. మూడు ముప్పై బుకింగ్ తీసే ఉంది. జనం అప్పుడప్పుడూ వచ్చి టికెట్స్ తీసుకు పోతున్నారు. ఏం చేయాలో తోచక తికమక పడుతున్నారిద్దరూ.

ఇంతలో ఓ తాతగారు ఆపద్బాంధవుడిలా కనిపించాడు.




"నమస్కారం, సార్!" అన్నాడు రామారావు వినయంగా, ఆ అపరిచిత వ్యక్తిని పరిశీలిస్తూ.

ప్రతి నమస్కారం చేసి వెళ్ళి పోబోయాడాయన. ఇంతలో దొరికిన కేసు జారిపోతుందేమోననే ఆదుర్దాతో-"అది కాదు, సార్, మేము మా ఫ్రెండ్ వస్తాడని ఒక టికెట్టు ఎక్స్‌ట్రా తీసుకున్నా.. కాని, వాడు రాలేదు. మీకు టికెట్ కావాలి గదా" అంటూ నీళ్ళు నములుతున్న రామారావుని-

"ఎంతేమిటి టికెట్?" అని ఎదురు ప్రశ్న వేశాడు తాతగారు.

"ఎంతేమిటి, సార్, నాలుగు రూపాయల టికెట్."

"నాలుగు రూపాయలే!" ఆశ్చర్యపోయాడు తాతగారు.

"సేమ్ రేట్" అన్నాడు కేశవరావు కలుగజేసుకుంటూ.

"మూడు ముప్పై బుకింగ్ ఇంకా తీసే ఉంది కదయ్యా! వద్దులెండి... నేను దానికే వెడతాను" అన్నాడాయన.

ఇక లాభం లేదని నాలుగు రూపాయల టికెట్ మూడు ముప్పైకే ఇచ్చి విజయం సాధించారు మిత్రులిద్దరూ. విక్రమార్కుడిలా ఫోజుపెట్టి చేతి కర్ర ఊపుకుంటూ థియేటర్ వేపు నడవసాగారు తాతగారు. మిత్రులిద్దరూ ఆయన వెనకే బయలుదేరారు.

"వచ్చారా, సార్" అంటూ అడిగాడు గేట్‌బాయ్- మీ మీద ఓ కన్నువేసే ఉంచాను సుమా అన్నట్టు చూస్తూ.

"ఆ... వచ్చాడు" అంటూ నసుగుతూ లోపలికెళ్ళారిద్దరు.

మూడురూపాయల ముప్పైపైసలు లాభం వచ్చింది. ఏం చేద్దాం? ఎలా ఖర్చు పెడదాం? అని ఆలోచిస్తున్నాడు రామారావు. అంతలోనే, బుకింగ్ క్లర్క్‌కి చెప్పేసి టికెట్ వాపస్ ఇచ్చి ఉంటే నా ఆనెస్టీకి గుర్తింపు వచ్చేదేమో అనుకున్నాడు వెంటనే.

** ** **

బుకింగ్ క్లర్క్ టికెట్లు, డబ్బు చెక్ చేసుకుని, డబ్బు తక్కువయే సరికి ఎంక్వయిరీ చేస్తాడేమో? గేటు బాయ్ తమ రహస్యం క్లర్క్‌కి చెబుతాడేమో? ఇద్దరు కలిసి మేనేజరుని, పోలీసులను తీసుకొచ్చి హాలులో హడావుడి చేస్తారేమో? అందరి ముందూ అల్లరి పాలౌతారేమో? అని రకరకాలుగా భయపడ సాగాడు రామారావు. దోమ గుయ్‌మంటే ఉలిక్కి పడుతున్నాడు. కుర్చీ కిర్రుమంటే కంగారు పడుతున్నాడు. తుమ్మితే అదిరి పోతున్నాడు. ఛ! వెధవ పని చేశానేమో? అని మథన పడసాగాడు.

ఇంతలో ఇంటర్వెల్ అయింది.

హమ్మయ్య! అనుకుని గబగబా బయటికి నడిచాడు. వెనకనే కేశవరావు వచ్చాడు. ఇద్దరూ టీ త్రాగి, సిగరెట్లు వెలిగించారు. రామారావుకు కాస్త రిలీఫ్ ఏర్పడింది. మళ్ళీ బెల్ మ్రోగటంతో రామారావు గుండె స్పీడ్ హెచ్చింది. నిజానికి అతనికి అక్కడనుండి పారిపోవాలనిపించింది. కాని, సభ్యత లోపలికి తీసుకొచ్చి కూర్చోబెట్టింది. ఇందాకటి కంటే కొంచెం ఫర్వాలేదనిపించింది. కంటికి సినిమాలో బొమ్మలు సరిగా కనబడుతున్నాయి. కాని, సినిమా ఏమిటో అర్థం కావటం లేదు. అప్పుడప్పుడు గేట్‌వైపు చూస్తూనే ఉన్నాడు. ఇంతలో చీకటిలో ఓ నల్లని ఆకారం-"ఎవరండీ ఇక్కడ" అంటూ తనవైపు రావడం చూసి గుండె అమాంతం పొట్టలోనికి పోయినట్లయి ఆరడుగుల రామారావు మూడడుగులకు కుంచించుకు పోయాడు. ఆ ఆకారం తనని దాటి ప్రక్కనున్న వాళ్ళ నుంచి వాళ్ళు త్రాగిన కూల్‌డ్రింక్స్ పైసలు తీసుకుని వెళ్ళిపోయింది. ఆత్మహత్య చేసుకోవాలనిపించిందతనికి. కాని, అది కుదరదని తెలుసుకుని విరమించుకున్నాడు. ఇన్ని ఆలోచనలతో సతమతమవుతున్న రామారావుకి తెరమీద "శుభం" కనిపించడంతో హమ్మయ్య అనుకుంటూ మూడడుగుల నుండి ఆరడుగులకు సాగి నిలబడ్డాడు.

"సినిమా టిక్కెట్ కొనుక్కుని హాయిగా సినిమా చూడలేదని బాధ పడుతున్న రామారావుకి -"సినిమాబాగుందోయ్! టికెట్లు దొరక వనుకున్నాను. సమయానికి వచ్చావు. థాంక్స్" అంటూ తాతగారు కృతజ్ఞత చెప్పగానే పుండుమీద కారం చల్లినట్లయి లాగి నాలు గిచ్చుకోవాలనిపించింది తాతగార్ని. పైకి మాత్రం—"దాందేముందిలెండి" అంటూ బయటకు నడిచాడు.

ఇంటికి చేరుకున్నాడు రామారావు- కేశవరావు దంపతులకు వీడ్కోలిచ్చి. తను చేసిన పాపం అనుక్షణం కళ్ళముందు మెదులుతుంటే ఆ రాత్రి నిద్రకు దూరమయ్యాడు.

"నేను చిన్నప్పుడు టికెట్ కొనకుండా రైల్లో ప్రయాణం చేశాను. తప్పు తెలుసుకున్నాను. అప్పుడు ప్రయాణం చేసిన టికెట్ ఛార్జీని ఫైనుతో సహా చెల్లించాను" అని ఓ మంత్రి ఇచ్చిన ప్రకటనను ఆరోజు దినపత్రికలో చూసి నిట్టూర్చాడు.

మనం ఆ విధంగా పబ్లిక్ ఫిగర్ కాలేము. మనల్ని ఏ పత్రికా ప్రతినిధీ ప్రశ్నించదు. ఆ విధంగా ప్రాయశ్చిత్తం చేసుకోవడం జరగని పని అనుకుంటూ, చేసిన పాపం చెబితే పోతుందని జ్ఞాపకం వచ్చి బుకింగ్ క్లర్క్ కంగారులో ఒక టికెట్టు ఎక్కువ ఇస్తే అది అమ్ముకున్నామని, చదువుకుని కూడ సంస్కార హీనంగా ప్రవర్తించానని చెప్పడానికి సిగ్గుపడిన వాడై చేతికి, మెదడుకు పని పెట్టాడు.

రాయడం పూర్తి చేసి, ఒకటికి పదిసార్లు తన కథని చదువుకుని, అనుక్షణం వెంటాడే గిల్టీ కాన్షస్ నుంచి రామారావు విముక్తి పొందాడు.

*